# 'అమ్మ' అంటే యేమిటి మమ్మీ?

వూరి శివార్లు దాటి, 'రిజర్వ్‌ఫారెస్ట్'ని పేరుపెట్టుకున్న చిట్టడవి మధ్యలో అరగంటసేపు పరిగెత్తి "లిటిల్ యేంజెల్స్ కాన్సెప్ట్ స్కూల్" ప్రాంగణంలోకి ప్రవేశించింది నలుపురంగు విదేశీకారు.

సమావేశమైన గ్రద్దల్లా నిల్చున్న కార్ల వరసకు పక్కనే తనకారునూ పార్క్ చేసిన తరువాత, కిందికిదిగి, వెనకతలుపుతెరిచాడు డ్రైవరు. ప్లాస్టిక్ సంచుల దొంతరలు వొడిసి పట్టుకున్నాక కిందికి దిగింది కృష్ణవేణి.

విసురుగా వీస్తున్న కొండగాలి తాకిడికి రంగులతోరణాలూ, ఆహ్వానపతాకాలూ పెద్దగా వూగిపోతున్నాయి.

విశాలమైన స్కూలు ప్రాంగణంలో, నిన్ననే వేసినట్టున్న యెర్రమట్టి బాటలపైన, రకరకాల దుస్తులు తొడుక్కున్న వ్యక్తులు హడావుడిగా తిరుగుతున్నారు. బాట కిరువైపులా వెదురుబుట్టల మధ్యలోంచీ యిప్పుడిప్పుడే పెరుగుతున్న యూకలిప్టస్ మొక్కల చిగుర్లు యిబ్బందిగా తలలూపుతున్నాయి.

దూరంగా రంగురంగుల దీపాలతో అలకరించుకుంటున్న వోపనేర్‌స్టేజీ చీకటి పడకముందే రంగస్థలంపైకి అడుగుపెట్టిన రికార్డు డాన్సరులా యెబ్బెట్టుగా కనబడుతోంది.

"బాగ్స్ తీసుకొస్తాను మేడమ్!" ముందుకు వంగి తెచ్చిపెట్టుకున్న వినయంతో డ్రైవరడిగాడు.

"వద్దొద్దు....నేనేపట్టుకెళ్తాను. నువ్విక్కడేవుండు." అంటూ కృష్ణవేణి ముందుకు కదిలింది. కట్టుకున్న పట్టుచీర పరపరమని కర్కశంగా శబ్దంచేయడంతో, విసుగ్గా ముఖం చిట్లించుకుని, వొక యూకలిప్టస్ మొక్క పక్కనే ఆగిపోయింది.

రెండుమూడు కొండల మధ్య యెత్తుగా వున్న ప్రదేశంలో కట్టిన స్కూలు దగ్గరినుంచీ లోలోతులకు పాకుతున్న లోయలు వయ్యారంగా సవాలు చేస్తున్నాయి. స్కూలు

ఆవరణచుట్టూ కట్టిన యినపతీగల కంచెకవతల అడవి పొంచి చూస్తోంది. యిటీవలే నాటిన విద్యుత్తీగల స్థంభాలు నిటారుగానిలబడి పహరాగాస్తున్నాయి. దూరంగా లోయల కవతల చిన్న కుగ్రామమేదో నక్కివుంది. దానికవతల చిన్న చెరువొకటి విరిగిన అద్దంముక్కలా ఆకాశాన్ని ప్రతిఫలిస్తోంది.

కొండకొమ్మున మొలిచిన పుట్టగొడుగుల్లాగున్న స్కూలు భవనాల చుట్టూ యూనిఫారాలు తొడుక్కున్న పిల్లలూ, బాడ్జీలు తగిలించుకున్న యువతీ యువకులూ అటూయిటూ చెడతిరుగుతున్నారు. షామియానా కిందకూచున్న అతిథులందరి చేతుల్లోనూ కోకోకోలా సీసాలున్నాయి.

చుట్టూ చెలరేగుతున్న అలజడీ, కలకలమూ తనను పట్టించుకోవడం లేదని స్ఫురించేసరికి కృష్ణవేణి కంగారు పడిపోయింది. ఆశతో పైకిపెరిగిన కొండా, తమకంతో కిందికి దిగిన అకాశమూ రెండు తప్పెటతాళాల్లా తయారై తనను నలిపిపారేస్తున్నట్టుగా తోచి ఆవిడ మరింతగా చలించిపోయింది.

"గుడీవనింగ్ మేడమ్! వుయార్ యెక్స్‌పెక్టింగ్ బోత్‌దీ పారెంట్స్? ఐతింక్ యువర్ బెటరాఫ్ ఆల్సో కమింగ్ టుదిస్ ఆన్యువల్‌డే ఫంక్షన్..." తెల్లటి షిఫాను చీరపైన యెగసిపడుతూన్న యెర్రటి బ్యాడ్జీతో పెదవుల లిప్‌స్టిక్ పోటీ పడుతూండగా వో పాతికేళ్ళ యువతి మరబొమ్మలా ముందుకొచ్చి నిల్చుని, రైల్వేస్టేషనులో యాంత్రికంగా వినవచ్చే ప్రకటనలాంటి మాటల్ని ప్రసారం చేసింది.

"బెటరాఫ్" అని గొణిగి, పెదవి విరిచి "మా ఆయన వూర్లోలేరు. అర్జంటు పనిపైన హైదరాబాదుకెళ్ళారు..." అంది కృష్ణవేణి.

"వుయారాల్సో యెక్స్‌పెక్టింగ్ గ్రాండ్ పేరెంట్సాఫ్ ది చిల్డ్రన్..." ఆవిడ మరో ప్రకటన చేసింది.

"మా అత్తగారికి బీపీ యెక్కువయ్యింది. డాక్టరు యిల్లు కదలద్దన్నాడు. మా మామగారికి యిన్ కంటాక్సు ఆఫీసులో అర్జెంటుపని..." కృష్ణవేణి గొంతు జీరబోయింది. యెండుకు పోతున్న పెదవుల్ని నాలుకతో తడుపుకోడానికి ప్రయత్నిస్తూ" మా అమ్మా నాన్నా..." అంటూ యేదోచెప్పబోయి అంతలో ఆగిపోయి గుక్కిళ్ళుమింగింది.

"యువార్ వెల్‌కంటూ అవర్ స్కూల్‌డే ఫంక్షన్ మేడమ్! కమాన్...లెటజ్ గోటుది విజిటల్స్ సర్కిల్ అండ్ హేయ్ యువర్ డ్రింక్. మేక్ యువర్‌సెల్ఫ్ కంఫర్టబుల్ మేడమ్.." తాను వాకబు చేసిన విషయాలకు సమాధానాలు వచ్చితీరాలన్న నియమమేమీ లేనట్టుగా బాడ్జీ యువతి బట్టీపట్టిన వాక్యాల్ని టేపురికార్డురులా వల్లిస్తూ ముందుకు సాగిపోసాగింది.

షామియానా దగ్గరికి రాగానే బాడ్జీ యువకుడొకడు కోకోకోలా నందించాడు. "మా అమ్మాయి..." అంటూ తనను ఆహ్వానించిన యువతికేసి తిరిగి చూసింది కృష్ణవేణి.

"జ్యోత్స్న...షీయీజ్ యిన్‌ది గ్రీన్ రూం..."

"జ్యోత్స్న గాదు.... మా అమ్మాయి కావ్య..."

"హో కావ్యా? ...షీ యీజాల్సోయిన్‌ది గ్రీన్ రూం... అయివిల్ యిన్ఫార్మ్ హర్..." బ్యాడ్జీయువతి వెనక్కుతిరిగి రాబోట్‌లా నడుచుకెళ్ళి పోయింది.

కుర్చీలో కూర్చుని, ప్లాస్టిక్ సంచులు పక్క కుర్చీలో పడేసి, కోకోకోలా చప్పరించసాగింది కృష్ణవేణి.

షామియానా కింద కుర్చీల్లో నిండుగా కూర్చున్న ఖరీదైన పట్టుచీరలూ, బ్రాండెడ్ రెడీమేడ్ చొక్కాలూ, జిగేల్మంటున్న నగలూ, మెరుస్తున్న బూట్లూ, పక్కవాళ్ళను పట్టించుకోకుండా తమను తామే మెచ్చుకుంటున్నట్టున్నాయి. దూరంగా పడమటి ఆకాశంలో సూర్యుడు వదలి వెళ్ళిన యెరుపురంగు నెవరూ పట్టించుకోవడం లేదు. లోయల్లోంచీ చల్లని గాలిని విసురుతున్న చెట్టూచేమలనెవరూ గమనించే స్థితిలోలేరు.

దూరంగా తెల్లటి దుస్తులు తొడుక్కున్న పిల్లలు కొందరు కిన్నెరల గుంపులా యెటో వెళ్తున్నారు.

"మమ్మీ!" వెనకనుంచీ రెండు చిన్నారి చేతులు కృష్ణవేణిని అల్లుకున్నాయి.

"నా బంగారు తల్లీ!" అలాగే పాపాయిని వొళ్లోకిలాక్కొంది ఆమె.

కావ్య ముఖానికి రోజారంగు చెమ్కీ, కళ్ళకు దట్టంగా కాటుకా, చెవులకు పెద్ద లోలాకులూ, తలలో రంగుయీకలూ, చేతులకు తెల్లరంగు గాజులూ, కాళ్ళకు తెల్లటి సాక్సూ, బూట్లూ – రంగు తన చీరకంటుకుంటుందేమోనని కంగారుపడుతూ "యేం వేషం వేస్తున్నావు తల్లీ?" అని అడిగింది కృష్ణవేణి.

"బేబీ యిన్‌ది డ్రామా!"

పాపకళ్ళు చుట్టూ కలయజూస్తున్నాయి.

"డాడీ రాలేదు బుజ్జీ! నీకోసం డ్రస్సూ, చాక్లెట్లూ పంపారు....గ్రానీకి బాగలేదు..."

కావ్య బొమ్మలా కళ్ళార్చి "మమ్మీ...మమ్మీ...అయ్‌గాటింగ్ సెకండ్‌రాంక్..." అంది

"గాటింగ్ అనగూడదమ్మా! అయ్ గాట్ ది సెకెండ్‌రాంక్ – అనాలి" కృష్ణవేణి మెల్లగా నవ్వింది.

"యువర్ బేబీ యీజ్ యెన్ యెక్స్‌ట్రీమ్లీ యింటలెక్చువల్ స్టూడెంట్ మామ్.."

కృష్ణవేణి తిరిగిచూసింది.

పాపాయిని వెంటబెట్టుకుని వచ్చిన బ్యాడ్జీధారణి లిప్‌స్టిక్‌తో అతుక్కుపోయిన పెదవుల్ని బలవంతంగా సాగదీస్తోంది.

"మాలప్రాపిజమ్ అంటే తెలుసా నీకు?" అన్న ప్రశ్న కృష్ణవేణి పెదవులదాకా వచ్చింది.

"షీయాజ్ ఆల్వేస్ వన్ అమాంగ్ దీ టాపర్స్..." బ్యాడ్జీధారణి పలవరిస్తున్నట్టుగా చెప్పుకుపోసాగింది–" షీయిాజ్‌వెరీమచ్ ఆక్టివ్ యిన్ దీగేమ్స్...షీయిాజ్ ఆల్సోయే గుడ్ సాంగర్ – షీగాట్ టూ ప్రయిజెస్ యిన్‌ది కాంపిటీషన్స్...షీయిాజ్యే గుడ్ యాక్టర్...కమాన్ బేబీ...సింగ్‌దట్ ఫేవరెట్‌సాంగ్ ఆఫ్‌యూ...కమాన్...హరియప్..."

కావ్య బిక్కమొహంతో తలను యిద్దరికేసీ తిప్పసాగింది.

"యువర్ సన్‌యిాజ్యే బ్రైట్‌స్టూడెంట్‌సార్! హీయిాజ్ వెరీవెరీ చార్మింగ్ అండ్ ఆక్టివ్...ఫస్ట్‌యిన్ యెవ్వెరీ తింగ్.." అవతలివైపు కూర్చున్న దంపతులకు వాళ్ళబ్బాయిని తీసుకొచ్చి అప్పగించిన బ్యాడ్జీయువకుడు తన నివేదికను వప్పగిస్తున్నాడు.

కృష్ణవేణి చీకాకుతో అదోలా బ్యాడ్జీ ధారిణికేసి తిరిగిచూసింది. మీట నొక్కినట్టుగా ఆమె పెదవులు మళ్లీ కదిలాయి – "షీయిాజ్ వెరీ ప్రాంప్ట్ యిన్ హోంవర్క్. హియరీజ్ హర్ ప్రోగ్రెస్ రిపోర్టు.."

"చూశాను చూశాను...మీరంతా పాపం చాలా పనుల్లోవున్నారు. మీరు వెళ్ళి మీ పనులు చూసుకోండి" కృష్ణవేణి చిరాకును కప్పిపుచ్చుకోడానికి ప్రయత్నించింది.

"నోనో మేడమ్...యిటీజ్యే ప్లెజర్ టుబి విత్ యూ..."

"పర్వాలేదు. మీరు వెళ్లండి!"

ఆయువతి వులిక్కిపడి, యెవరోతరుముతున్నట్టుగా వెళ్ళిపోతున్నప్పుడుగానీ తాను బిగ్గరగాకేకేశానన్న సంగతి కృష్ణవేణికి అర్థంగాలేదు.

అతిధులందరికీ తనను పరిచయస్తుడిలా భావించుకున్న యువకుడొకడు "హీయిాజ్ అవర్ ప్రిన్స్‌పాల్ కమ్ కరస్పాండెంట్ – డాక్టర్ లోకప్రకాష్..యెమ్యే పీహెచ్డీ, డిప్ యిన్ పర్సనాలిటీ డెవలప్‌మెంట్, డిప్ యిన్ కమ్యూనికేటివ్ యింగ్లీష్.." అంటూ తమ ప్రిన్స్‌పాల్ని పరిచయం చేసుకుంటూ ముందుకొచ్చాడు.

దాదాపు నలభయ్యయిదేళ్ళ వయసూ, బాగా కిందికి దిగి మీసాలతో కలిసిపోయిన సైడ్‌లాక్సూ, చుబుకంపైన చిన్న పిల్లిగడ్డం, కళ్ళకు బైఫోకల్ కళ్ళజోడూ, నల్లసూటుపైన పెద్దరిబ్బన్ల బ్యాడ్జీ....డాక్టర్ లోకప్రకాష్, యెమ్యే పీహెచ్డీ, డిప్‌యిన్ పర్సనాలిటీ డెవలప్‌మెంట్, డిప్‌యిన్ కమ్యూనికేటివ్ యింగ్లీష్ – ముఖంలో మెరుస్తున్న పలువరసతో, కావల్సిన అన్ని రకాల హంగులతో, రేసు కోర్సులోకదుగుబెడుతున్న అరబ్బీ గుర్రంలా

సకిలించాడు– “హలోసార్! యూహావ్ ప్రామిస్డ్ మీ దట్ యూవిల్ అరేంజ్ యేన్ యింటర్వ్యూ ఫార్మీ విత్‌దీ యెజుకేషన్ మినిస్టర్... అండ్ ఆల్సోవిత్‌దీ డైరక్టర్...అయామ్ వెరీక్యూరియస్ ఆఫ్‌యిట్... వోకేవోకే, తేంక్స్‌యే లాట్... హలో రాంచంద్ర చౌదరిగారూ! గుడీవనింగ్ సార్! యువార్ ఆల్వేస్ ది స్ట్రెంగ్త్ ఫార్మీ...దట్ యూయీ కేమ్ హియర్ పర్సనలీ అండ్ డిడ్‌దీనీడ్‌ఫుల్.. గుడీవనింగ్ డీడీరెడ్డిగారూ! యువార్ కమింగ్‌టు అవర్ స్కూల్ ఫార్‌ది ఫస్ట్‌టయిం... యువర్ కిడ్‌యీజ్ డూయింగ్ వెల్... హీయీజెన్ యెస్సెట్ టూ అజ్... వుయార్ మేకింగ్ యువర్ చిల్డ్రన్ యిన్‌టూ ఫ్యూచర్ జెమ్స్... దేవర్త్ క్రోర్స్... గుడీవనింగ్ మేడమ్... ఐతింక్ యువార్...”

“నేను కావ్యతల్లి నండీ! మా ఆయన అరుణ్ సాగర్....” పాపాయిని అక్కునలాక్కుంటూ టక్కున అడ్డుతగిలింది కృష్ణవేణి.

“అయ్‌నో..అయ్‌నో..ఐతింక్ హియీజ్ వెరీబీజీ...యే బిజినెస్ టైకూన్ లైక్ హిమ్ విల్‌హావ్ మెనీ యింపార్టెంట్ తింగ్స్ టు లుకాఫ్టర్..అయామ్‌హాపీ టు రీసీవ్ యూ...తాంక్స్‌ఫార్ స్పేరింగ్ సమ్‌టయంటు అజ్...వెల్‌కం మేడమ్...”

“గుడీవనింగ్ మేడమ్! ప్లీజ్ సెండ్ దీ బేబీ టుది గ్రీన్ రూం...షీనీడ్స్ టచఫ్ బిఫోర్‌దీ ప్రోగ్రాం!” ముఖానికి మరోసారిపౌడరు దట్టించి, పెదవులకో కొత్త లిప్‌స్టిక్‌పూత పట్టించుకుని రంగప్రవేశం చేసిన బ్యాడ్జీధారిణి కావ్య చేయి పట్టుకుంటూ అడిగింది. ఆమె వెంట తల వెనక్కు తిప్పిచూస్తూ వెళ్తున్న కావ్యకేసి చూస్తూ కళ్ళల్లోంచీ జారిన కన్నీళ్ళను తుడుచుకోవడం కోసం కృష్ణవేణి ముఖాన్ని పక్కకు తిప్పుకుంది.

“కమాన్ మేడమ్, అవర్ ఫస్ట్‌డ్యూటీ యీజ్ టు షో ది స్కూల్ ప్రెమిసస్...” ప్రిన్సిపాల్ డాక్టర్ లోకప్రకాష్ తన పని తాను చేసుకుపోతూనే వున్నాడు. “యిటీజ్ ఆల్టుగెదర్ ఫిఫ్టీ యేకర్స్ ఆఫ్ లాండ్... ఐహేవ్ స్పెంట్ ఆల్ ఐ హాడ్ టు బిల్డఫ్ దిస్ స్కూల్...దిసీజ్ మైడ్రీం ప్రాజెక్ట్ ... ఐ హేడ్‌టు యిన్వెస్ట్ ఆల్ అయ్ యెర్న్డ్ యిన్ ది అదర్ బిజినెస్, హోటల్ అండ్ హాస్పిటల్స్...దిసీజ్ యీనాగురేటెడ్ బై అవర్ హానరబుల్ మినిస్టర్.... లుకట్‌దిస్ బిల్డింగ్... దిస్‌స్ట్రక్చర్ యీజ్ ఫస్ట్‌యిన్ యేషియా! అయ్‌గాట్ దిస్ ప్లాన్ ఫ్రం హార్వర్డ్...అవర్ స్టూడెంట్ హాస్టల్ యీజ్ మోర్ కంఫర్టబుల్ దేన్ యే ఫైవ్‌స్టార్ హోటల్...కంప్లీట్లీ యెయిర్ కండీషన్డ్. దిసీజ్‌ది స్విమ్మింగ్ ఫూల్ అండ్‌దటీజ్‌దీ టెన్నిస్‌కోర్ట్...హావ్యూసీన్ అవర్ యిన్డోర్ స్టేడియం...బట్ వుయ్‌డోంట్ అలౌ అవర్ చిల్డ్రన్ టూ ప్లే యెవ్వరిడే! వోన్లీ వనవర్ ఫర్‌యేవీక్. దేడోంట్‌హావ్ సఫిసయింట్ టయిం ఫార్ స్టడీస్...దేరార్ వన్ టీచరు ఫరెవ్వరీ ట్వంటీ స్టూడెంట్సు...దే టేక్కేరాఫ్ దెమ్ యిన్‌ది

హాస్టల్...ఫర్‌ఫెక్ట్ డిసిప్లెయిన్...మార్నింగ్ ఫైవ్ మిల్క్ ... ప్రేయర్..సిక్స్ స్టడీస్, నైన్ స్కూల్, వన్‌వోక్లాక్ లంచ్, త్రీ స్నాక్స్, యివనింగ్ టూ అవర్స్ స్టడీ...నైట్ యెయిట్ డిన్నర్..నైన్ స్లీపింగ్..."

"సార్! సార్! చీఫ్‌గెస్ట్ అరైవుడ్..." వో బ్యాడ్జీ యువకుడు పరిగెత్తుకొచ్చాడు.

"తాంక్‌గాడ్...అయామ్ వేరీమచ్ నెర్వస్ బికాస్ అయామ్ వర్రీడ్ ఆఫ్ హిస్ ప్రోగ్రాం....ఫైనలీ దీ మినిష్టర్ హాజ్‌కమ్...అండ్ దీ మూవీస్టార్ విలాల్సో కమింగ్ సూన్..ఐటేక్ లీవ్ ఆఫ్‌యూ ఫార్‌ది ప్రజెంట్...అవర్ మెన్ విల్ షో యూ దీ అదర్ తింగ్స్...థ్యాంక్యూ మేడమ్స్ అండ్ సార్స్ ఫార్‌స్పేరింగ్ యువర్ వాల్యుబుల్ టయిం. బై బై...." మాట్లాడుతూనే డాక్టర్ లోకప్రకాశ్ వెనక్కు నడచాడు.

"ఐవెల్‌కం ఆలాఫ్‌యూ టు అవర్ ప్రిస్టీజియస్ స్కూల్‌సార్...కమాన్...లెటజ్ బిగిన్ వేరవర్ ప్రిన్సిపాల్ హాజ్ లెఫ్ట్‌యూ..." బ్యాడ్జీ యువకుడు వెంటనే తన పాత్రను పోషించడం మొదలుపెట్టేశాడు.

ముందుకెళ్తున్న గుంపులోంచీ వెనక్కు ఆగిపోయాక కృష్ణవేణి బిక్కుబిక్కుమంటూ నిలబడిపోయింది.

యింకా కొండగాలి వీస్తూనే వుంది.

చీకటి పడకముందే స్కూలు ఆవరణలో విద్యుద్దీపాలు వెలగసాగాయి...

"యిక్కడే ఆగిపోయారేం మేడమ్! కమాన్. ఐ విల్‌షోయూదీ స్కూల్..." వెనకనుంచీ ఆహ్వానం వినిపించగానే కృష్ణవేణి వులిక్కిపడింది.

"బైదీబై వాటీజ్ యువర్ చైల్డ్స్ నేమ్..వాట్‌క్లాస్ యీజ్ హీ స్టడియింగ్?..." అతను మాట్లాడుతూండగానే కృష్ణవేణి రెండు చేతులూ జోడించి "సార్ నమస్తే! నేను కృష్ణవేణి...మీస్టూడెంటును...."అంది.

గాలికెగురుతున్న టైని సర్దుకోలేక సతమతమవుతున్న బట్టతల ముసలాయిన కళ్ళజోడును సవరించుకుంటూ "గుడీవనింగ్..గుడీవనింగ్...మీరు...మీరు.." అంటూ తడబడ్డాడు.

"మిమ్మల్నిక్కడ యిలా కలుస్తాననుకోలేదు సార్...చాలా సంతోషంగా వుంది.. నేనుసార్..కృష్ణవేణి...నైన్టీన్ సెవన్టీ సెవన్‌లో మీ స్టూడెంటు న్సార్...నేనూ రాజేశ్వరీ, ముంతాజ్, సారా...మేమంతా వొకబెంచీ..." కృష్ణవేణి జ్ఞాపకాల తెరల్లోంచీ గతాన్ని వెతుక్కోసాగింది.

రెండడుగులు ముందుకేశాక "నీలో చాలా చేంజివచ్చినట్టుందమ్మా! యెప్పుడో చూసినట్టుగా మాత్రమే అనిపిస్తోంది" అన్నాడాయన.

"ఆరేడు సంవత్సరాలైపోయిందిసార్! యెమ్మే అవుతూనే పెళ్ళయిపోయింది. కావ్యపుట్టింది. కొంచెం లావయినట్టున్నాను..." కృష్ణవేణి మరో అడుగుముందుకేసింది.

"చదువుకుని వెళ్ళిపోయిన స్టూడెంట్లంతా నాకొకే బాచీ కిందనే లెక్కమ్మా! యెవరెవరు యే సంవత్సరంలో చదివారో చెప్పలేనుగానీ గుర్తుమాత్రం పట్టేస్తాను" అన్నాడాయన.

"టీచర్లు స్టూడెంట్లనందరినీ గుర్తుపెట్టుకోవాలంటే కుదురుతుందా సార్! మాకు మాత్రం మీరెప్పుడూ జ్ఞాపకం వస్తూనే వుంటారు. మీరు నాలుగేళ్ళ క్రితమే రిటయరయ్యారని విన్నాను." అంది కృష్ణవేణి.

"యూనివర్సిటీలో ప్రొఫెసరుగా రిటయిరయ్యింది నిజమేనమ్మా! కానీ వుద్యోగంమాత్రం చేస్తూనేవున్నాన్లే ... యిక్కడే ...లాస్ట్ టూయియర్స్‌గా ..." యిలారమ్మని పిలుస్తున్నట్టుగా షామియానా కవతలున్న భవనంకేసిన నడవసాగాడు ప్రొఫెసరు.

వోపనేర్ ఆడిటోరియం దగ్గర బ్యాడ్జీధారులు అదే పనిగా తిరుగుతున్నారు. ప్రిన్సుపాల్ గది ముందు మరికొంత మంది బ్యాడ్జీధారులు మోహరించి వున్నారు. మాట్లాడుతూనే ప్రొఫెసరు వో భవనంలోని తన గదిముందు ఆగి "యిలా కూచోమ్మా! నేను చాలాసేపు తిరగలేను...ఐయామ్ ఆల్రెడీ యెగ్జాస్టెడ్" అన్నాడు.

గది తలుపుల ముందున్న బోర్డు పైకి చూశాక "ప్రొఫెసర్ యం. ఆర్.రావు, అకడమిక్ అడ్వయిజర్" అని చదువుకొంది కృష్ణవేణి.

టేబుల్ కవతలున్న కుర్చీలోకూర్చుని, నీళ్ళగ్లాసును ఖాళీ చేశాక "అకడమిక్ అడ్వయిజరు అనేది రెస్పెక్టబుల్ టెర్మ్...చేసేపని అదిగాదు..పిల్లలకు లీజరున్నప్పుడంతా వెళ్ళి యింగ్లీషు కమ్యూనికేటివ్ స్కిల్స్‌నేర్పాలి." అన్నాడు ప్రొఫెసర్ రావు.

"పదో తరగతి వరకూ వుండే యీ స్కూల్లోనా? మీరు యింగ్లీషు కమ్యూనికేటివ్ స్కిల్స్ నేర్పడమా? దానికి పెద్ద యూనివర్సిటీలో పనిచేసిన మీలాంటి పెద్ద ప్రొఫెసరు కావాలా?" కృష్ణవేణి నిర్ఘాంతపోయింది.

"వాళ్ళకు కావాలా వద్దా అన్నది గాదు యిక్కడి సమస్య... నాగ్గూడా యిలాంటి వుద్యోగమొకటి కావాలి. ఐయామ్ వెరీ బాడ్లీ యిన్ నీడాఫ్ దిస్‌జాబ్!...ఫార్ విచ్ ఐయాం తాంక్‌ఫుల్ టూ దిస్ యిన్‌స్టిట్యూషన్..." ప్రొఫెసరు రావు రివాల్వింగ్ కుర్చీలో వెనక్కువాలి చేతులు వెనక్కుచాచి పెద్దగా వొళ్ళు విరుచుకున్నాడు. తరువాత మెల్లగా కళ్ళుపైకెత్తి "నువ్వు నైన్టీన్ సెవెన్టీనైన్ బాచీనా? మీహజ్బెండేం చేస్తాడు?" అని అడిగాడు.

"బిజినెస్ సార్..." కృష్ణవేణి తలవంచుకుని ముద్దాయిలా చెప్పింది. "మధుశా యెంటర్ ప్రయిజెస్ మేనేజింగ్ డైరక్టరు.."

"మధుశా యెంటర్ ప్రైజెస్సా? యెలక్ట్రికల్ అప్లయన్స్ ఫ్యాక్టరీగూడా వుందే, ఆ మధుశానేనా?.." ప్రొఫెసరు రావు ఆశ్చర్యంతో కుర్చీలోనే వూగిపోయాడు.

అవునన్నట్టుగా కృష్ణవేణి తలవూపింది.

"నిజంగా? బాప్‌రే! నా స్టూడెంటు మధుశా మేనేజింగ్ డైరక్టరు భార్యా! ఐకాంట్ యెక్స్‌పెక్టియిట్...హౌలక్కీ ఐయామ్...బైదీబై, నువ్వు నీపెళ్లికి నాకు కార్డు పంపావా?..."

"లేదుసార్! అంతా అర్జెంటుగా జరిగిపోయింది...మా ఆయన వచ్చి చూడ్డమూ, పెళ్లి ఫిక్స్‌గావడమూ, వెంటనే పెళ్ళీ అన్నీ గబగబా జరిగిపోయాయి" అందికృష్ణవేణి. అదోలా చూస్తున్న ప్రొపెసర్ రావును చూసి సిగ్గుపడుతూ నవ్వి "నన్ను మా ఆయన యానివర్సిటీలోనే చూశారట లెండి...యింటికొచ్చి ప్రపోజ్‌చేశారు. వాళ్ళమ్మా నాన్నగూడా వోకే అన్నారు...మానాన్న వెంటనే పెళ్ళిచేయలేనని అన్నారు. అయితే అంతా మేమే చేసుకుంటామని పెళ్ళిగూడా వాళ్ళే చేసుకున్నారు...." అంది.

"హౌలక్కీ యీజ్ యువర్‌ఫాదర్...ఆయనేంచేస్తాడు?" ప్రొఫెసర్ రావుకు కుతూహలం ఆగడంలేదు.

"హైస్కూలు హెడ్మాస్టరుగాచేసి రెండేళ్ళ ముందు రిటయిరయ్యారు" కృష్ణవేణి చూపులు ఆకాశంలో వేలాడుతున్నాయి.

"వాట్ వాట్? హైస్కూలు టీచరా? నిజం చెప్పమ్మా! మీది లవ్‌మారేజీగదా?..." ప్రొఫసర్‌రావు ముఖంలో యెందుకోరంగులు మారుతున్నాయి.

"మా ఆయనది లవ్‌మారేజీ...నాది అరేంజ్‌డ్ మారేజీ...." కృష్ణవేణి మరోసారి సిగ్గుపడింది.

వోసారి కృష్ణవేణిని పైకీకిందికీ చూశాక యేదో అర్థమయినట్టుగా తలవూపుతూ" "నౌ అయ్ నో ది ఆన్సర్... యువర్ హజ్బెండ్ యీజ్యేకనోయిజర్..." అన్నాడు.

రెండునిముషాలు మౌనంగా వుండిపోయిన తర్వాత" యువార్ కరెక్ట్‌సార్! మా ఆయన చిన్నప్పటినుంచీ కనాయిజరే అని మా అత్తామామ చెబుతూవుంటారు.. ఆయనకు వూళ్లో అందరికంటే పోష్‌గావుండే యిల్లుండాలి. యెప్పుడేంకావలిస్తే ఆరకం భోజనం అందుబాటులో వుండాలి. దేశంలో దొరికే కొత్తబ్రాండ్ కారే వుండాలి. వీటిలో యేది తక్కువైనా ఆయనకారోజు నిద్రుండదు.." అంది కృష్ణవేణి.

"అందుకే తనకందరికంటే అందమైన భార్యే దొరకాలని అనుకున్నాడు! అంతేగదా! దటీజ్‌దీ స్పిరిట్...యూఆర్ రియల్లీలక్కీ! అండ్ యువర్ ఫారెంట్సార్ డబ్లీలక్కీ! నీకెందరు తోబుట్టువులున్నారు? వాళ్ళేంచేస్తున్నారు? అయినా నాకీ డవుట్లన్నీ అవసరమా చెప్పు?

మీ ఆయనే వాళ్ళందరికీ మంచి జాబ్‌లు వెదికిపెట్టుంటాడు..లక్ అంటే అదీ...అందరికీ అది దొరకదు.." మాట్లాడుతూనే ప్రొఫెసర్ రావు వెనక్కువాలి కళ్ళుమూసుకున్నాడు. కాస్సేపటి తర్వాత అతడి కళ్లలోంచీ రెండు కన్నీటి బొట్లుజారి కళ్ళద్దాల కతుక్కోవడం గమనిస్తూనే కృష్ణవేణి బెంబేలుపడి సర్దుకుని కూచుంది.

చీర రెపరెపలు వినబడుతూనే ప్రొఫెసర్‌రావు కళ్ళు తెరిచి "ముప్పయ్యేళ్ళు యూనివర్సిటీలో పనిచేశానుగదా, యిక హాయిగా యింట్లోనే వుండి రెస్టు తీసుకోవాలనుకున్నానమ్మా! కుదర్లేదు..మా పెద్దబ్బాయి కెమిస్ట్రీలో పీహెచ్డీ చేశాడుగానీ గవర్మెంటు జాబ్‌రాలేదు. ప్రైవేటు కాలేజీలో పనిచేస్తున్నాడు. మా అమ్మాయికి లాస్టియరే పెళ్ళిచేశాను. అప్పులున్నాయి.. ఆ భారం నా కొడుకు పైన పడగూడదని..." అంటూ నీళ్ళునమిలాడు. తరువాత "మీ యెంటర్‌ప్రైజెస్‌లో యేదయినా జాబ్‌వుందేమో చూడమ్మా... నాగ్గాదు. నాడాటరిన్లాకు.. ఆ అమ్మాయి భలే యింటిలిజెంట్...ఫిలాసఫీలో పీహెచ్డీ చేసింది. మన వూర్లోనే వో ప్రయివేటు స్కూల్లో టీచరుగా వుంది... పనెక్కువ. జీతం తక్కువ..." అన్నాడు.

కృష్ణవేణి బలవంతంగా నవ్వడానికి ప్రయత్నించింది.

"నువ్వు చెప్తే దానికెదురుంటుందామ్మా!" అన్నాడు ప్రొఫసరు రావు.

"చెప్తానుసార్! కానీ..కానీ... ఆయనకు నాతో తీరిగ్గా మాట్లాడే తీరిక దొరకాలి..." అంటూ మాటల్ని సాగదీసింది కృష్ణవేణి.

"పోనీ మీ మామగారికే నేరుగా చెప్పమ్మా! కోడలిమాటదాటే వాళ్లెవరుంటారు?" ప్రొఫెసరురావు ఆవిడ ముందుకాళ్ళకు బంధం తగిలించబోయాడు.

అలాగేనన్నట్టుగా తలపూపాక" మా మామగారిది యెక్స్‌టర్నల్ డిపార్టుమెంటు సార్! యెప్పుడూ ట్యూర్లూ, యినస్పెక్షన్లూ... మా అత్తగారికి క్లబ్బులూ, గుళ్ళూ, పూజలూ..."అంది.

ప్రొఫెసర్ రావు కాలింగ్ బెల్ నొక్కాక "నీకు మాత్రం తక్కువ పనులుంటాయామ్మా! నాకు ఆమాత్రం తెలియదా? అంతపెద్ద బిజినెస్ మాగ్నట్ భార్యంటే మజాకానా? యెన్ని మీటింగులు, యెన్నిపార్టీలు, యెన్ని గెట్‌టుగెదర్లూ... పాపం, తీరకలేక యెలావేగుతున్నావో యేమో! అందుకే నీముఖంలో అంతగా బడలిక స్పష్టంగా కనబడుతోంది. అయినా యెలాగో తీరిక చేసుకుని నీ డాటర్ కోసం యింతసేపు యిక్కడ స్పెండ్ చేస్తున్నావు... సంతోషం... వుయార్ లక్కీ..." అన్నాడు.

యింతలో గదిలోకొచ్చిన అటెండరుతో "మేడమ్‌కు వేడికాఫీ తీసుకురా!" అన్నాడు.

కృష్ణవేణి వెనుతిరిగి రుమాలుతో కళ్ళు వొత్తుకుంది.

"యేమయ్యిందమ్మా!" ప్రొఫెసరు రావు కంగారుపడుతూ అడిగాడు.

"కంట్లో యేదో నలక...." కృష్ణవేణి గొంతు చలించింది.

"కాకపోతే మధుశాయెంటర్‌ప్రైజస్ యండీ భార్యకు కన్నీళ్ళొచ్చే అవసరముందని అంటారా యెవరైనా?"ప్రొఫెసర్ రావు పెద్దగా నవ్వబోయాడు.

రాకెట్టులా గదిలోకి దూసుకొచ్చిన బ్యాడ్జీధారొకడు తెల్లకాగితమొకటి ప్రొఫెసరు రావు ముందుంచి "హరియప్‌సార్!" అనికేకేశాడు.

ప్రొఫెసరు రావు గబాగబా కళ్లజోడు సవరించుకుని కాగితం వైపుకు చూపులు మరల్చి "యిదేమిటి? యీ తెలుగుడ్రామాను యెవరు యిన్‌క్లూడ్ చెయ్యమన్నారు?..." అని కసిరాడు.

"తెలుగుడ్రామానా? అదేమిటిసార్?" కృష్ణవేణి గబాలున అందుకుంది.

"మాకీస్కూల్లో తెలుగుటీచరొకడున్నాడమ్మా! వాడితో పెద్ద తలనొప్పయి పొయ్యింది. యీ ఆనివర్సిరీలో నీ తోకేమీ ఆడించద్దని యెంత చెప్పినా వినడు. యిప్పుడీ సుభద్రా పరిణయమనే గేయనాటకమొకటిరాసి, దీన్ని యెనాక్ట్ చెయ్యాల్సిందేనంటాడు. వాన్ని కొంచెం అదుపులో పెట్టేపని నా కప్పగించాడు మా కరెస్పాడెంటు.." ప్రొఫెసర్ రావు మిగిలిన ప్రోగ్రాంను పరిశీలిస్తూనే విసుక్కున్నాడు.

"గేయనాటకమా? బావుంటుంది లెండిసార్!" కృష్ణవేణి వుత్సాహంగా అంది.

ప్రొఫెసర్ రావు కళ్ళుపైకెత్తి చూశాడు.

"మా హైస్కూల్లో ప్రతి సంవత్సరమూ ఆనివర్సిరీలో నేను నాటకాల్లో వేసేదాన్ని సార్! ఆరులో ప్రహ్లాదుడూ, యేడులో ధ్రువుడూ, యెనిమిదిలో 'పెన్నేటిపాటా', తొమ్మిదిలో 'వాల్మీకి', పదిలో 'వరూధిని'...చూశారా, అన్నీ యెంత బాగాగుర్తున్నాయో, యిప్పటికీ!....ఆసర్టిఫికెట్లన్నీ మావూళ్లోనే వుండాలి... మానాన్నగారు జాగ్రత్తగా పెట్టారోలేదో..." కృష్ణవేణి చిన్నపాపాయిలా కళ్ళార్పుతూ వుత్సాహంగా చెబుతూవచ్చి చివరలో దిగాలుగా ఆగిపోయింది.

"ఆ సర్టిఫికెట్లన్నీ యిప్పుడు నువ్వేంచేసుకుంటావమ్మా! నాలుకగీసుకోడానికి కూడా నీకు పనికిరావవి..." ప్రొఫెసరు రావు విసుగు కృష్ణవేణి పైన్నో, లేకపోతే తెలుగుమాష్టారి పైన్నో అర్థంగావడంలేదు...

"కెనై ఆస్క్ హిమ్ టు రిమూవ్ దట్..." బ్యాడ్జీధారి హడావుడి పెట్టాడు.

"వద్దొద్దు....ప్రోగ్రాం బిగినవగానే తిరిగొచ్చేయమన్నారు మా అత్తగారు... కానీ ఆ గేయనాటకమేదో చూసివెళ్ళాలనివుందిప్పుడు" కృష్ణవేణి అడ్డుతగిలింది.

ప్రొఫెసరు రావు తలవూపుతూ "మధుశా యెండీ వైపు అడిగితే కాదనేదేముంది? ఆ తెలుగుసార్ భలేలక్కీ!" అన్నాడు. తరువాత బ్యాడ్జీధారికేసి చూసి "వుండీనీలే! అయితే బోరుగొట్టించకుండా త్వరగా ముగించమను" అని హెచ్చరించాడు. అతను కాస్తదూరం వెళ్ళాక "యిదమ్మా అకడమిక్ అడ్వయిజరు చేసేపని..." అని నీరసంగా నవ్వాడు.

"మీరు ఆ నాటకం పేరు చెప్తూవుంటే మళ్లీ నాకు మీరు మాకు టీచ్ చేసిన 'హామ్లెట్' జ్ఞాపకం వస్తోంది సార్! అప్పుడు మేము మన టౌన్‌కు పదిమైళ్ళ దూరంలోవుండే కొత్తపల్లెలో వుండేవాళ్ళం. రోజూ వుదయమూ సాయంత్రమూ రైల్లో తిరుగుతూ చదవుకున్నాను. రైల్లో నిల్చోడానికైనా స్థలముండేదిగాదు. అంత జనం.. అయినా మేం వొకటే కబుర్లు...సమయం గడిచేది తెలిసేదేకాదు...మళ్లీవోసారి నాకా రోజులొస్తే బావుండేదని పిస్తోంది సార్!" కృష్ణవేణి సంభ్రమంగా అంది...

టేబుల్‌పైకొచ్చిన కాఫీకప్పును ముందుగా కృష్ణవేణి కిచ్చాక తానో కప్పు అందుకుని "యిఫ్ ఐకాన్ గో బాక్టు దోస్ డేస్... మళ్లీ ఆరోజులకు నేను వెళ్ళగలిగితే....అప్పుడుచేసిన తప్పులు మళ్లీ చెయ్యనమ్మా! మా వాడిని కంప్యూటర్ యింజనీర్ని చేయగలిగితే యెంత బాగుణ్ణు! మా డాటర్‌ను గూడా యేదయినా ప్రొఫెషన్‌లో కోర్సు చెయ్యమని చెప్పుండాల్సింది. యిప్పుడు మంచి జాబ్‌లు దొరికేది ఆ చదువులకే గదా!" అన్నాడు ప్రొఫెసర్ రావు. తరువాత "నువ్వుగూడ అలా పాతరోజులకెళ్ళాలని కోరుకోవని నాకు తెలుసు! ఐనోదట్ యువార్‌నాట్యే ఫూల్‌టు తింక్ లైక్‌దట్... అప్పుడు నువ్వు మామూలు టీచరు కూతురువి. యిప్పుడూ? మధుశా యెండీ భార్యవు...రైల్లో తిరగాల్సిన కర్మనీకేం పట్టింది?వాడ్డూయూసే..." అని పెద్దగానవ్వేశాడు.

గబగబా గదిలోకొచ్చిన బ్యాడ్జీ యువకుడు "సార్సార్! ప్రోగ్రామ్ యీజ్ అబవుట్టూ స్టార్ట్....వుయ్‌నీడ్ యువర్ ప్రజెన్స్..." అని ప్రకటించాడు.

ప్రొఫెసరు రావు పైకిలేచి "వెళ్దాం పదమ్మా! ఆ సుభద్రాకళ్యాణం కోసం నువ్వు గంటయినా వెయిట్ చెయ్యాల్సిందే! యెందుకంటే యెంటర్‌టెయిన్‌మెంట్ల ముందు పెద్ద మీటింగూ, ప్రయిజ్ డిస్ట్రిబ్యూషనూ వున్నాయి... వచ్చే సంవత్సరం ఆనివర్సరీకి నువ్వే ప్రయిజెస్ డిస్ట్రిబ్యూట్ చెయ్యాలి! యిది నా ఆడ్వాన్స్‌డ్ యిన్విటేషను.... యీ మాటచెప్తే మా కరెస్పాండెంటు యెగిరి గంతేస్తాడు" అన్నాడు...

రంగస్థలం ముందున్న కుర్చీల్లో అతిథులందరూ దర్పంగా కూర్చునివున్నారు. వేదికపైన సింహాసనాల్లోని ముఖ్యఅతిధులు కళకళలాడుతున్నారు. మధ్యలో తిరుగుతున్న బ్యాడ్జీ యువతులూ, యువకులూ లేని వుత్సాహాన్ని కొని తెచ్చుకుంటూ పరుగులు తీస్తున్నారు...

వో బ్యాడ్జీధారిణి వెనకనుంచీ పరిగెత్తుకొచ్చిన కావ్య"మమ్మీ! ఐయామ్ సెర్చింగ్ ఫర్ యూ! యూహేవ్‌టూవెన్ అయ్‌టేక్‌దీ ప్రయిజెస్..." అంటూ కృష్ణవేణి కాళ్ళకు చుట్టుకుంది.

"మేడమ్! అయ్‌తింక్ యుఆర్ హేపీటూ..." అంటూ బ్యాడ్జీధారిణి యేదో చెప్పబోయింది.

"అవును... యిప్పుడెందుకో నాకు భలే సంతోషంగా వుంది... చాలా సంవత్సరాలుగా యెందుకో భలే వొంటరితనంతో వేగిపోయాను. కానీ యిప్పుడు... యిప్పుడు... మరచిపోయినదేదో...."

"యేం మరచిపోయారు మేడమ్! చెప్పండి. కావాలంటే మైకులో అనవున్సు చేయిస్తాను." బ్యాడ్జీధారిణి మర్యాదకు కంగారును మిలాయించి నాట్యం చేయబోయింది.

కృష్ణవేణి తటాలున నడవడం ఆపేసి దూరంగా పడమటి ఆకాశంలో యింకామిగిలిన కెంజాయరంగుకేసి ఆదేపనిగా చూడసాగింది.

వేదికముందు ట్రంపెట్లు మోగసాగాయి. మైకులో యేదో జలుబు గొంతు గీపెడుతోంది. కొండపైన్నుంచీ పెల్లుబుకుతున్న శబ్దాలకు లోయల్లోంచీ ప్రతిధ్వనులు వినిపిస్తున్నాయి.

"మమ్మీ! మమ్మీ!..." కావ్య కృష్ణవేణి చీరకుచ్చిళ్ళు పట్టిలాగింది.

వులిక్కిపడి వంగిన కృష్ణవేణి కళ్ళల్లోంచీ రెండు కన్నీటి బొట్లు రాలి కావ్యపైన పడ్డాయి. ఆమె కంగారుగా తలపైకెత్తి చుట్టూచూసింది.

తనకేసి చిత్రంగా చూస్తున్న బ్యాడ్జీధారిణిని పట్టించుకోకుండా, కావ్యను పైకెత్తుకుని "కావ్యా! నన్ను మమ్మీ అని పిలవద్దు ప్లీజ్!...అమ్మా అనిపిలువు..." అంది.

కావ్య వొకనిముషం సేపు తల్లివైపు ఆయోమయంగా చూసింది.

తరువాత మెల్లగా ప్రశ్నించింది -

"అమ్మా అంటే యేమిటి మమ్మీ?"

27-12-85 ఆంధ్రజ్యోతి వారపత్రిక